# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 16 సంచిక:158 | విజయవాడ, 3-3-2026 , మంగళవారం | పేజీలు: 8 | వెల: 1.00

## ఇందిరమ్మ ఇండ్ల కోసం వసూళ్లకు పాల్పడ్డ కాంగ్రెస్ నేత కేసు నమోదు

వికారాబాద్వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని, టీపీసీసీ కో-ఆర్డినేటర్ ధారా భాస్కర్ రూ.లక్ష డిమాండ్ చేశాడని గూళ్ళ కేశవులు అనే వ్యక్తి ఆరోపించాడు. గత ఏడాది రూ.50 వేలు వసూలు చేశాడని, మిగతా రూ.50 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు ధారా భాస్కర్పై కేసు నమోదు చేసారు.

## బాణసంచా పేలుడు ఘటన.. శివకాశీ వెళ్లి స్టడీ చేయండి: సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా.. తమిళనాడులోని శివకాశీ వెళ్లి స్టడీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్పై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల సమర్థత పెరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తే గ్రామాలు, వార్డులపై దృష్టి పెట్టాలన్నారు. 'దీపం' సిలిండర్ల డెలివరీలో డబ్బులు వసూలు చేయకుండా చూడాలన్నారు. బస్టాండ్లలో సౌకర్యాలు, పౌరుగు సేవలు మెరుగ్గా ఉండాలని సూచించారు. అన్ని బస్టాండ్లలోని శౌచాలయాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.



## భారత్ ఎప్పుడూ శాంతియుత పరిష్కారాన్నే కోరుకుంటుంది: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే ఇండియా నిశ్చితాభిప్రాయమని అన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పేర్కొన్నారు. భారత్లో పర్యటిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నేతో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో ప్రధాని మాట్లాడారు.

ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, రాడికలైజేషన్ మనకే కాక ప్రపంచ దేశాలకు సవాళ్లు విసురుతున్నట్టు చెప్పారు. దీనిపై సమష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్త ఉద్రిక్తతల విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒకటేనని, శాంతి, సుస్థిరత కీలకమని, రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేస్తే శాంతి మరింత పటిష్టమవుతుందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయులు ఎక్కడున్నా వారితో ఎప్పుడూ సంప్రదింపులు జరుపుతూ వారి భద్రతకు భారత్ కట్టుబడి ఉంటుందని చెప్పారు.

అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గత శనివారంనాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్లోని 30 చోట్ల దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్, అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ శాంతియుత పరిష్కారాని పిలుపునిచ్చారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్ పర్యటనకు విచ్చేయడంతో విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కూడా కెనడా నిర్ణయం తీసుకుంది.

## 'నా ఇంటిని ఆక్రమించారు'.. పెట్రోల్ పోసుకొని వృద్ధుడి ఆందోళన



గుంటూరు: తన ఇంటిని ఆక్రమించారంటూ గుంటూరు కలెక్టరేట్ వద్ద పాపయ్య అనే వృద్ధుడు పెట్రోల్ పోసుకొని ఆందోళనకు దిగారు. గమనించిన స్థానికులు, పోలీసులు ఆయన దగ్గరున్న పెట్రోల్ సీసా లాక్కున్నారు. తన ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసినా.. ఫిరంగిపురం పోలీసులు పట్టించుకోవడం లేదని వృద్ధుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి తనను బలవంతంగా బయటకు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కళాశాల బస్సును ఢీ కొట్టిన బైక్.. ముగ్గురు యువకుల మృతి

పెదపాడు: అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. బైక్పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సును ఢీ కొట్టి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలం జానంపేట ఎఫ్సీఐ గోడౌన్స్ సమీపంలో జరిగింది. ఏలూరు బీడీ కాలనీకి చెందిన ఈ ముగ్గురూ కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలు సేకరిస్తున్నారు.

## కాకినాడ సీజన్ 5 రెస్టారెంట్లో దారుణం..




కాకినాడ, మార్చి 2: కాకినాడలో సీజన్ 5 రెస్టారెంట్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ రెస్టారెంట్పై ఫుడ్ సేఫ్టీ అధికారులు సహా రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, సివిల్ సప్లైస్ విభాగాల అధికారులు ఈరోజు(సోమవారం) ఆకస్మికంగా దాడులు చేశారు. రెస్టారెంట్లో వినియోగదారులకు నిల్వ చేసిన మాంసం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో కిలోలకొద్దీ చికెన్, ఫ్రై శాంపిల్స్ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. నిల్వ మాంసం కావడంతో అన్నింటినీ సీజ్ చేసినట్లు తెలిపారు.

నిల్వ మాంసాన్ని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెస్టారెంట్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కూడా అధికారులు తప్పుబట్టారు. ఈ చర్యలతో రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రత్తిపాడులో జంతుకొవ్వుతో నూనె తయారు చేస్తూ ఓ ముఠా పట్టుబడిన ఘటన మరువకముందే కాకినాడ రెస్టారెంట్ నిర్వాహకుల మోసం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కాకినాడలోని అనేక హోటల్స్లో తరచూ ఆహార కల్తీ జరుగుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారు.

## సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక సీఎస్గా విజయానంద్ బాధ్యతల స్వీకరణ



అమరావతి: సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 28న సీఎస్గా ఆయన పదవీ విరమణ చేయగా ప్రభుత్వం ఆయన్ను ముఖ్యమంత్రి ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ నేపథ్యంలో సచివాలయంలోని మొదటి అంతస్తులో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, తితిదే వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, సచివాలయ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యం

రొళ్ల: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యమైన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొళ్ల మండలం హెచ్.టి హళ్లి వడ్రహట్టి గ్రామానికి చెందిన వీరేశ్ తాపీ మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి సుబ్బమ్మ, భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు రోహిణి, రచనతో కలిసి నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన వీరేశ్.. భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 27న ఇంట్లో మరోసారి గొడవ జరిగింది. అదేరోజు రాత్రి ఇంటి నుంచి సుబ్బమ్మ, లక్ష్మి, రోహిణి, రచన బయటకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి బంధువులు వెతుకుతున్నా వారి ఆచూకీ లభించలేదు. దీంతో మార్చి 1న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గౌతమి తెలిపారు. వీరేశ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.



## గరికపాటి సలహాలు మాకు అవసరం లేదు.. కమలానంద భారతి ధ్వజం

విజయవాడ, మార్చి 2 ( : ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి తీవ్రంగా స్పందించారు. తాజా వివాదంపై ఆయన ఇవాళ(సోమవారం) వీడియో విడుదల చేశారు. వింత పోకడలు, వింత ఆలోచనలు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని ధ్వజమెత్తారు. మహా సంకల్పంలో అంగ, వంగ, కళింగ, సౌరాష్ట అని చెప్పుకునే క్రమంలో కేరళ, ద్రవిడ, ఆంధ్రా అని వస్తుందని వివరించారు. రామాయణ కాలం నుంచి ఇక్కడ ఒక జాతి ఉందని.. దానికి ఆంధ్రా అనే పేరు ఉందని ప్రస్తావించారు.

ఆంధ్ర మహాభారతం, ఆంధ్ర భాగవతం రాశారని కమలానంద భారతి తెలిపారు. అడిగి వారు లేరని తెలివి, పాండిత్యం, అధిక ప్రసంగం ఎక్కువయ్యి తెలుగు భాగవతం, తెలుగు భారతం జరుపుకుంటున్నారని అన్నారు. మాజీ సీఎం నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారని.. ఆయన నినాదం ఆంధ్రుల ఆత్మగౌరవమని ఉద్ఘాటించారు. రాష్ట్రాల విభజన జరిగిందని.. మానసికంగా అందరం కలిసే ఉన్నామని చెప్పుకొచ్చారు.

# ముగిసిన ఖమేనీ శకం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధృవీకరించింది. టెహ్రాన్‌లోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలకమైన సైనిక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త ధృవీకరణ కావడంతో ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది. దశాబ్దాల కాలం పాటు ఇరాన్ రాజకీయ, సైనిక వ్యవస్థను శాసించిన ఒక శకం దీనితో ముగిసింది.ఖమేనీ మరణంతో అమెరికా, ఇజ్రాయెల్ పంతం నెగ్గినట్లయింది. అయితే యుద్ధం ముగిసిపోతుందా అంటే చెప్పడం కష్టం. ఖమేనీ చనిపోయినా ఇరాన్ లొంగిపోయే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, నాయకత్వ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ స్వీకరించింది. కానీ క్షేత్రస్థాయిలో పట్టున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతీకారేచ్ఛతో ఉంది. ఇప్పటికే అమెరికా స్థావరాలపై , ప్రాంతీయ మిత్రదేశాల లక్ష్యాలపై ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. నాయకత్వ శూన్యతను పూడ్చుకునే క్రమంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు లభించిన గొప్ప అవకాశంగా అభివర్ణించారు. ఇరాన్ పాలనలో మార్పు రావాలని అమెరికా ఆశిస్తున్నారు. అంటే లొంగిపోవాలని ఆయన కోరుకుంటున్నారు. కానీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తమ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇరాన్ అణు , క్షిపణి వ్యవస్థలే తదుపరి లక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ పరిణామం వల్ల మధ్యప్రాచ్యం ఒక్కసారిగా అనిశ్చితిలోకి వెళ్లిపోయింది. దుబాయ్, బహ్రెయిన్ వంటి వాణిజ్య కేంద్రాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రస్తుతం ఇరాన్ తన తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియలో ఉంది. ఖమేనీ కుమారుడు వారసుడు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అమెరికా ప్రోద్బలంతో అధికార మార్పిడి సజావుగా సాగదని.. అంతర్గత తిరుగుబాట్లకు దారితీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇరాన్ లోపల అంతర్యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, అది ప్రపంచ చమురు సరఫరాను , ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. యుద్ధం ఆగిపోవడానికి బదులు, ఇది ఒక సుదీర్ఘమైన ప్రాంతీయ సంఘర్షణకు ఆరంభంగా మారుతుందేమోనన్న భయం గల్ఫ్ దేశాల్లో నెలకొంది. అందుకే ఖమేనీ అంతంతో అన్నీ అయిపోలేదు.. అసలు సమస్యలు ముందున్నాయని ప్రపంచదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణులతో విజృంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చాయి. ఖమేనీ కూతురు, అల్లుడి కూడా ఈ దాడుల్లో మరణించినట్లు ఇరానీ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఖమేనీ మరణంతో పాటు 40 రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన యుద్ధం నిర్విరామంగా కొనసాగుతోంది. ఖమేనీని హతమార్చుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా ప్రకటిస్తూ వస్తోన్నారు. చివరికి ఇజ్రాయెల్‌తో కలిసి తన శపథాన్ని ట్రంప్ నెరవేర్చుకున్నారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. బంగారం, వెండి ధరలు మండిపోతున్నాయి.ఖమేనీ మరణంతో యద్దం మరింత ముదిరే అవకాశముంది. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఖాతార్, అబుదాబిపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. గల్ఫ్ దేశాలపై కూడా యుద్ధ ప్రభావం పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సోమవారం రికార్డ్ దిశగా దూసుకెళ్లే అవకాశముందని మార్కెట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన కొద్ది సేపటికే ముందుగా క్రిప్టో కరెన్సీలపై దీని ప్రభావం పడింది. బిట్ కాయిన్ 5 శాతం పడిపోయి 64 వేల డాలర్ల మార్క్ కంటే దిగువకు పడిపోయింది. యుద్ధ ప్రభావంతో సోమవారం నుంచి మార్కెట్లు అస్థిరంగా ఉండవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక పసిడి ధరలు సరికొత్త రికార్డులు సృష్టించచొచ్చని చెబుతున్నారు.ఇక ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం, అమెరికా కూడా యుద్ధంతో పాల్గొనడంతో ముడి చమురు ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. యుద్ధ ప్రభావం వల్ల ఇరాన్‌లో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ క్రమంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటి వెళ్లవచ్చని అంటున్నారు. ఇజ్రాయెల్- అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికిపైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆంటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది.ముడి చమురు ధరలు పెరిగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే నౌకలు ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో సరకు రవాణా సమయం 15-20 రోజులు అవుతుంది. దీంతో ఖర్చు 50 శాతం వరకు పెరుగుతంది. ఇవన్నీ అంతిమంగా వినియోగదారుడిపైనే పడతాయి. ఇదే కాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూసివేశారు. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో విమాన కంపెనీలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధ ఖర్చుల ప్రభావం కనిపిస్తుంది. దీంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరగవచ్చు.

# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ

విజయవాడ, మార్చి 2,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెడ్డి సామాజిక వర్గం కొత్త రాజకీయ వేదిక కోసం ఆలోచిస్తున్నదా అనే ప్రశ్న తాజాగా చర్చకు వస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తమకు ప్రత్యేక రాజకీయ పార్టీ అవసరమనే భావన కొంతమంది నేతల్లో బలపడుతున్నట్టు సమాచారం. ఈ దిశగా రాష్ట్రంలోని సీమ ప్రాంతం తో పాటు నెల్లూరు ప్రాంతానికి చెందిన నాయకులు చర్చలు జరుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డి వర్గం పెద్దఎత్తున మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తరువాతి కాలంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే భావన ఆ వర్గంలో పెరిగిందని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రెడ్లకు ఇవ్వాల్సిన అవకాశాలు ఇతర వర్గాలకు కేటాయించారనే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న ప్రముఖులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.2024 ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత మారిందని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ ఓటమి అనంతరం రెడ్డి వర్గంతో ప్రత్యేక సమావేశాలు జరగకపోవడం, వారి సమస్యలపై చర్చలు లేకపోవడం అసంతృప్తికి దారితీసిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సొంత రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచన కొంతమంది నాయకుల్లో బలపడుతోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల వైపు కూడా కొంత ఆశతో చూసినప్పటికీ, ఆమె రాజకీయ వ్యూహాలు భిన్నంగా ఉండటంతో పెద్దగా ఆకర్షణ కలగలేదని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో కూడా రెడ్డి వర్గానికి ప్రాధాన్యం ఉందని చెప్పినా, క్షేత్రస్థాయిలో ఆశించినంత స్థాయి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతీయ జనతా పార్టీ పై హిందుత్వ ముద్ర ఉండటంతో అందరూ ఆ దిశగా వెళ్లడం లేదని చెబుతున్నారు. జనసేన పార్టీ విషయంలో కూడా పెద్ద ఎత్తున మద్దతు కనిపించడం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల మధ్య తెలంగాణ లో నివసిస్తున్న ఏపీకి చెందిన రెడ్డి నాయకులతో కూడా సంప్రదింపులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో హైదరాబాద్ లో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించే ఆలోచన ఉందని చెబుతున్నారు. ఒకవేళ కొత్త పార్టీ ఆవిర్భవిస్తే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.కాంగ్రెస్ పార్టీ అంటేనే రెడ్డి సామాజిక వర్గం. అంతలా ఉండేది ఆ పార్టీలో సామాజిక వర్గ ప్రభావం. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో.. వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేశారు. రాజశేఖర్ రెడ్డి నాయకత్వం కింద రెడ్డి సామాజిక వర్గమంతా పనిచేసింది. దీంతో 2004లో తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. 2009లో సైతం రెండోసారి అధికారం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. దానికి ముమ్మాటికి కారణం రెడ్డి సామాజిక వర్గం మద్దతు. రాజశేఖర్ రెడ్డి మరణంతో రెడ్డి సామాజిక వర్గమంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరింది. ఆ సామాజిక వర్గమంతా జగన్మోహన్ రెడ్డిని ఓన్ చేసుకున్నారు. కానీ ఆయన అనుకున్న స్థాయిలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. రెడ్డి సామాజిక వర్గం నియోజకవర్గాల్లో సైతం ఇతరులకు అవకాశాలు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. తన ఐదేళ్ల పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఒనగూరే ప్రయోజనాలు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గం మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయ నిరాకరణ చేసింది.అయితే ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి వైఖరిలో మార్పు రావడం లేదు. రెడ్డి సామాజిక వర్గం విషయంలో ప్రత్యేక ఆలోచనలు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో తమకోసం ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వేదికగా ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒక ప్రత్యేక అజెండాతో ముందుకు సాగుతూ.. ఎన్నికల సమయానికి కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ముందడుగు వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి రాజకీయ పార్టీ ఏర్పాటుకు మరికొద్ది నెలలో ఒక తుది రూపు వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?కానీ రెడ్డి సామాజిక వర్గంలో జరుగుతున్న చర్చలు మాత్రం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవేళ ఆ వర్గం ఏకమై కొత్త దిశగా అడుగులు వేస్తే, అది ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# కలకలం రేపుతున్న డీప్ ఫేక్ వీడియోలు

తిరుమల మార్చి 2,

సోషల్ మీడియా వేదికగా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తీవ్రంగా స్పందించారు. కొందరు వ్యక్తులు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి, తన వ్యక్తిగత ప్రతిష్టను భంగపరచడమే కాకుండా, పవిత్రమైన టీటీడీ సంస్థ గౌరవాన్ని దిగజార్చేందుకు కుట్ర పన్నారని బీఆర్ నాయుడు ఆరోపించారు. ఈ మేరకు అప్రతిష్ట పాలు చేసేలా సాగుతున్న ఈ ప్రచారాన్ని అరికట్టాలని కోరుతూ ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు.ఆధునిక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ తన రూపాన్ని అనుకరించేలా కృత్రిమ వీడియోలను తయారు చేశారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. ఈ వీడియోల్లోని కంటెంట్ అంతా పూర్తిగా అసత్యమని, కావాలనే వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు పక్కా పథకం ప్రకారం ఈ కుట్ర సాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నకిలీ డీప్ ఫేక్ వీడియోలతో కొందరు సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు.వ్యక్తిగతంగా నన్ను అప్రతిష్ట పాలు చేసేందుకు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు చేస్తున్నారు.

ఏఐ సాంకేతికతను వాడుకుని నా రూపం అనుకరించే విధంగా వీడియోలు తయారు చేసి ప్రచారం?ఈ దుష్ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని బి.ఆర్. నాయుడు ఆరోపించారు. ప్రధానంగా వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు తనపై ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, దీనిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ, భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న ఇటువంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ విభాగం తన ఫిర్యాదుపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ నాయుడు కోరారు.డీప్ ఫేక్ కంటెంట్‌తో ప్రముఖుల జీవితాలతో ఆటాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి అసాంఘిక శక్తులు. దారి తప్పిన వారి చేతుల్లోఉన్న రాజకీయ పార్టీలు ఇలాంటివి బరి తెగింపుతో చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో వదిలేసి..విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ వాటికి బాధ్యత తీసుకోవడంలేదు. మాకు సంబంధం లేదని.. అవి సోషల్ మీడియాలో వచ్చాయి కాబట్టే తాము ప్రచారం చేస్తున్నామని చెబుతూంటారు. అంటే.. వారే క్రియేట్ చేసి.. వారే తమ హ్యాండిల్స్ లో ప్రచారం చేసి.. కానీ అవి సోషల్ మీడియాలో వచ్చినట్లే చెబుతూంటారు కానీ.. అవి నిజమైనవే అని చెప్పరు. అలా చెబితే అది ఫేక్ అని తేలితే వారిపైనే కేసులు పడతాయి కాబట్టి.వైసీపీ ప్రధాన వ్యూహం మొదటి నుంచి ఒకటే. ఎదుటి వారిపై బురద చల్లేయడం. వారు తుడుచుకుంటూంటే.. ఆనందించడం. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపడం. ఇప్పుడు లడ్డూ కల్తీ కేసులో టీటీడీని అన్ని విధాలుగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు టీటీడీ ఛైర్మన్ ను టార్గెట్ చేశారు. ఆ వీడియో ఫేక్ కాకపోతే నిజం అయితే వైసీపీ దీన్ని అసలైనదేనని ప్రకటించి ముందు ఉండి పోరాడాలి. సోషల్ మీడియా వెనుక దాక్కకోకూడదు. అది ఫేక్ అయితే వైసీపీనే బాధ్యత తీసుకుని కేసులను ఎదుర్కోవాలి.ఈ వీడియోతో మాకు సంబంధం లేదని.. సోషల్ మీడియాలో తిరుగుతోంది కాబట్టి తాము ప్రచారం చేస్తున్నామని .. రచ్చ చేస్తే మాత్రం వైసీపీ కుట్ర బుద్ధి బయటపడినట్లే. పోలీసులు ఈ డీప్ ఫేక్ వీడియో ఎక్కడ క్రియేట్ అయిందో తెలుసుకుని వారి విషయం తేల్చాలి. ఇలాంటివి నిర్లక్ష్యం చేస్తే.. రేపు మరొకరి మీద చేస్తారు. అలాంటి వీడియోలకు హద్దే లేకుండా పోతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను అడ్డం పెట్టుకుని ఇతరుల వ్యక్తిత్వంపై దాడులు చేసి.. నీతి లేని తమ నేతలతో సమానం చేయాలనుకుంటారు.ఒక వేళ ఆ వీడియో నిజం అయితే నైతిక కోణంలో టీటీడీ ఛైర్మన్ ను ప్రశ్నించడానికి సర్వ హక్కులు ఉంటాయి. అందులో అంత అభ్యంతరకరమైనది ఏమీ లేకపోయినా.. టీటీడీ ఛైర్మన్ గా ఉన్న త స్థానంలో ఉన్న వ్యక్తి నైతిక విలువలు పాటించాల్సి ఉంటుందని ప్రశ్నించవచ్చు.

---

# వైఎస్ వివేక కేసులో కొత్త ట్విస్ట్

కడప, మార్చి 2,

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు మళ్లీ ఊపందుకుంది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత అధికారులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కడప జిల్లా పులివెందుల కేంద్రంగా కీలక వ్యక్తుల విచారణ ప్రక్రియను సీబీఐ బృందం తిరిగి ప్రారంభించింది.ఈ కేసులోప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి బంధువులపై సీబీఐ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ కుమార్ యాదవ్, అలాగే భరత్ కుమార్ యాదవ్ సోదరుడు మహేంద్ర యాదవ్‌లకు విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. పులివెందుల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అధికారుల ఎదుట మహేంద్ర యాదవ్ ఇప్పటికే విచారణకు హాజరుకాగా.. కిరణ్ కుమార్ యాదవ్ విచారణకు రానున్నట్లు సమాచారం.ప్రస్తుత విచారణలో ( అత్యంత కీలకమైన అంశం కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డిల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలే. సుప్రీంకోర్టు సూచనల మేరకు వీరిద్దరి కాల్ డేటాపై సీబీఐ లోతుగా దర్యాప్తు చేస్తోంది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు రాత్రి అనగా.. తెల్లవారుజామున సరిగ్గా 1:42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి ఒక వాట్సాప్ కాల్ వెళ్లినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది.హత్య జరిగిన సమయానికి అత్యంత చేరువలో, పైగా అర్ధరాత్రిపూట ఈ కాల్ వెళ్లడం దర్యాప్తు అధికారుల అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య అసలు ఏం చర్చ జరిగింది? వివేకా హత్యకు, ఈ కాల్‌కు ఉన్న లింక్ ఏంటి? అన్న కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు. కాగా, ఈ ఫోన్ కాల్ వ్యవహారంపైనే ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లో సైతం వీరిద్దరినీ సీబీఐ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. తాజా పులివెందుల విచారణతో ఈ కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ స్థానికంగా నెలకొంది

# ప్రమాద తీవ్రతకు కారణమదేనా..భరోసా ఏదీ

కాకినాడ, మార్చి 2,

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటన యావత్ రాష్ట్రాన్నిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర ప్రమాదంలో సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. విస్ఫోటనం సంభవించిన వెంటనే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటమే కాకుండా, దాదాపు రెండు గంటల పాటు వరుసగా పేలుళ్లు సంభవించాయి. దీనివల్ల ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కూడా ఘటనా స్థలానికి చేరుకోలేకపోయారు. చివరకు కొందరు స్థానికులు ధైర్యం చేసి అక్కడికి వెళ్లేసరికే చాలామంది అగ్నికీలలకు ఆహుతయ్యారు. చెల్లాచెదురుగా పడి ఉన్న శరీర భాగాలు అక్కడ నెలకొన్న భీతావహ పరిస్థితికి అద్దం పట్టాయి.ఈ ప్రమాద తీవ్రత పెరగడానికి ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు కూడా ఒక కారణమని తెలుస్తోంది. బాణసంచా కేంద్రం వరి పొలాల మధ్య ఉండటం, వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో ఫైరింజన్లు, అంబులెన్స్‌లు సకాలంలో చేరుకోలేకపోయాయి. బురదమయంగా ఉన్న పొలాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. తీవ్రంగా గాయపడిన వారిని అతికష్టం మీద కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్న వారిలో వేట్లపాలెంకు చెందిన కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీనుతో పాటు సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వం ప్రకటించింది.వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంపై కాకినాడ ఆర్‌డీవో మల్లిబాబు స్పందించారు. ఈ తయారీ కేంద్రానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు లైసెన్స్ గడువు ఉందని వివరించారు. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే ఘటనకు బాధ్యుడైన యజమాని అక్కడి నుండి పరారయ్యాడని, ప్రస్తుతం అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణ ప్రకారం, వరి పొలాల మధ్య ఆరు షెడ్లలో ఈ బాణసంచా తయారీ సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ పెను ప్రమాదం జరిగిన సమయంలో కొందరు కార్మికులు భోజనం నిమిత్తం షెడ్ల నుండి బయటకు వెళ్లడం వారి ప్రాణాలను కాపాడింది. లేనిపక్షంలో మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. విస్ఫోటనం జరిగిన ధాటికి వేట్లపాలెం గ్రామంలోని పలు ఇళ్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్ లో ఆరుగురు బాధితులు మృత్యువుతో పోరాడుతున్నారు. వీరిలో వేట్లపాలెంకు చెందిన కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం నివాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను మరియు చిటికెల లక్ష్మి ఉన్నారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

## రాజకీయ కోణం తగదు..

ప్రమాదం అనేది చెప్పి రాదు.. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. కానీ నిన్న వేట్లపాలెంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరం. దానిని రాజకీయ కోణంలో ఎంత మాత్రం చూడకూడదు. అలా చూస్తే దాని కంటే మహా పాపం ఉండదు. ఘటన జరిగి దాదాపు 24 గంటలు అవుతోంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు ఘటనా స్థలానికి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. అయితే ఏదైనా ఘటన జరిగినప్పుడు గంటల వ్యవధిలో పరామర్శిస్తేనే దానికి బాధ్యత అంటారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తీరుబాటుగా రేపు బాధితుల పరామర్శకు వెళ్తున్నారు. అయితే ఆయన పరామర్శలపై అనేక రకాల విమర్శలు ఉన్నాయి. బాధితులతో ఆయన కేవలం ఐదు నిమిషాలు మాత్రమే గడుపుతారు. కానీ దానికోసం చేసే హంగామా మాత్రం గంటల తరబడి సాగుతుంది. రోడ్లను దిగ్బంధించడం, వేలాది మందితో బలప్రదర్శనకు దిగడం పరిపాటైన విద్యగా మారింది.ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధితులను నిశ్శబ్దంగా వెళ్లి సాయం చేయవచ్చు. కానీ భారీ ఎలివేషన్స్ నడుమ సాయం చేస్తుంటారు. విషాద ఘటనల సమయంలో బాధితుల పరామర్శకు వెళ్ళినప్పుడు పూల వర్షాలు, నినాదాలు, రప్పా రప్పా ఫ్లెక్సీల మధ్య యాత్రలు సాగిస్తుంటారు జగన్ మోహన్ రెడ్డి. పరామర్శించే క్రమంలో రాజకీయం చేయడం మాత్రం ఎంత మాత్రం తగదు. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి పట్ల ఒక రకమైన విమర్శ ఉంది. నిన్ననే వేట్లపాలెం లో ఘటన జరిగింది. ఆ సమయంలో ఒక్క వైసీపీ నేత కూడా అటువైపు చూడలేదు. అయితే ఇప్పుడు అధినేతను తీసుకొని రేపు బయలుదేరుతున్నారు. ఘటన జరిగినప్పుడు అధికారులు నానా హైరానా పడుతుంటారు. దానికి మించి అన్నట్టు జగన్ పర్యటన సమయంలో ఉంటుంది. అయితే గతంలో జరిగిన ఘటనలను గుణపాఠాలుగా మార్చుకొని.. బాధితులకు ఆర్థిక సాయంతో పాటు భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలి. బలప్రదర్శనకు దిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఇష్టపడుతుందేమో కానీ.. సామాన్యులకు కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలి.

# టీడీపీ కొత్త అధ్యక్షుడిగా కొల్లు..?

విజయవాడ, మార్చి 2,

రాష్ట్రంలో రకరకాల రాజకీయ ప్రచారాలు జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. దీంతో మంత్రివర్గంలో చేర్పు మార్పులు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. అయితే ఎవరిని మంత్రి పదవుల నుంచి తీస్తారో? కొత్తగా ఎవరికి ఇస్తారో? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి మార్పు ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న పల్లా శ్రీనివాసును మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి ఇస్తారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఆది నుంచి టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే బీసీ నేతకు తప్పకుండా ఆ పదవి కేటాయిస్తారని తెలుస్తోంది. ప్రముఖంగా ఓ మంత్రి పేరు వినిపిస్తోంది. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. దీంతో తెలుగుదేశం పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించారు చంద్రబాబు. ఏపీతోపాటు తెలంగాణకు వేర్వేరుగా రాష్ట్ర అధ్యక్ష పదవులను కేటాయించారు. జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు కొనసాగుతుండగా రెండు రాష్ట్రాల్లో పార్టీలకు మాత్రం వేర్వేరు అధ్యక్షులను నియమిస్తూ వచ్చారు. 2014లో తొలిసారిగా కిమిడి కళా వెంకట్రావును నియమించారు. ఆయన బిసి కాగా తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందినవారు. అటు తరువాత కింజరాపు అచ్చెనాయుడుకు ఛాన్స్ దక్కింది. ఆయన సైతం బీసీ. వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. అటు తరువాత 2024 ఎన్నికల అనంతరం పల్లా శ్రీనివాస్ కు ఆ పదవి ఇచ్చారు. ఆయన సైతం బిసి. యాదవ సామాజిక వర్గానికి చెందినవారు.టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలన్నది ఒక ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఇప్పుడు పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకుంటే.. టిడిపి అధ్యక్ష పదవి మార్పు అనివార్యం. అయితే కొల్లు రవీంద్ర పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనను మంత్రివర్గం నుంచి తప్పించి టిడిపి రాష్ట్ర పగ్గాలు అందిస్తారని తెలుస్తోంది. చంద్రబాబుతో పాటు లోకేష్ కు అత్యంత విధేయుడు రవీంద్ర. తొలిసారిగా మచిలీపట్నం నుంచి 2009లో పోటీ చేసి ఓడిపోయారు. 2014లో రెండోసారి పోటీ చేసి గెలిచారు. చంద్రబాబు క్యాబినెట్లో ఐదేళ్లపాటు మంత్రిగా కొనసాగారు. 2019లో ఓటమి ఎదురైంది. 2024 లో మాత్రం విజయం సాధించి రెండోసారి మంత్రి పదవి చేపట్టారు. అయితే ఇప్పుడు విస్తరణలో భాగంగా ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించి టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు ఇస్తారని తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# భద్రాద్రిలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం సమీక్షా భేటిలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 2,

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం నందు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వసంతపక్ష తిరు కళ్యాణ నవహాన్నిక బ్రహ్మోత్సవాలతోపాటు ఈనెల 27వ తేదీన జరగనున్న శ్రీరామనవమి కళ్యాణం ఏర్పాటులకు సంబంధించి సమీక్ష సమావేశం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు జిల్లాలో ఉన్నటువంటి వివిధ శాఖల అధికారులతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మరియు గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు..

ఈ సమీక్ష సమావేశంలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయంలో ఈనెల18వ తేదిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణము మరియు పట్టాభిషేకం మహోత్సవాల కోసం ఏర్పాట్లపై అయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.... దీనిలో భాగంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చేటటువంటి భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులకు మజ్జిగ మరియు మంచినీరు ప్యాకెట్లు అందించాలని ఆయన సూచించారు . సీతారాముల వారి కళ్యాణానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు ...భద్రాచలం నుండి పర్ణశాల వెళ్ళేటటువంటి రోడ్డు మార్గం గుంతలు గుంతలు గా ఉందని వాటన్నిటిని వెంటనే ఆర్ అండ్ బి శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈసారి రాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరగాలని భద్రాచలం బ్రిడ్జిపై కూడా లైటింగ్ ఏర్పాట్లను చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు..

భక్తులకు లడ్డూ ప్రసాదం ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులను ఆయన ఆదేశించారు ఆ విధంగా లడ్డూను తయారుచేసి తాజా లడ్డూను భక్తులకు అందజేయాలని మరియు లడ్డులో నాణ్యత లోపాల తలెత్తకుండా చూడాలని ఆయన ఫుడ్ ఇన్స్పెక్టర్లుకు సూచనలు చేశారు..

# జగన్ పార్టీకి వరుస కష్టాలు

విజయనగరం, మార్చి 2, (న్యూస్ పల్స్)

వైసీపీ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో నేనున్నాను



అంటూ ముందుకు వచ్చారు రాజశేఖర్ రెడ్డి. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది నేతలు ఉన్నారు. అందులో రాజశేఖర్ రెడ్డి ఒకరు. పార్టీలో సైతం చాలా పదవులు చేపట్టారు. అయితే తెలుగుదేశం పార్టీ ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో.. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్న కసి నాయకుల్లో ఉండేది. దానిని గుర్తించారు రాజశేఖర్ రెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి చురుకైన నాయకులను గుర్తించారు. అలా పుట్టుకొచ్చిన వారే ఒక బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, కొణతాల రామకృష్ణ వంటి నేతలు. అయితే కార్యక్రమంలో ఎటువంటి నేతలంతా జగన్మోహన్ రెడ్డి కొడుకు కిందకు చేరారు. కానీ వారిని సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోయారు జగన్మోహన్ రెడ్డి.

ప్రస్తుతం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీని నడిపే నాయకుడు కూడా లేరు. బొత్స సత్యనారాయణ లాంటి బీసీ నేత జగన్మోహన్ రెడ్డికి ఒక రక్షణ వలయంగా నిలిచారు. అయితే దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం ఇచ్చారు. మండలిలో వైసీపీ పక్ష నేతగా కూడా ఛాన్స్ కల్పించారు. తనకున్న పాత పరిచయాల ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు బొత్స. అయితే ఈ క్రమంలో బొత్స అనారోగ్యానికి గురికావడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్. ఆ స్థాయిలో ఇప్పుడు ఎవరు పనిచేస్తారు అనేది ఒక ప్రశ్న. రకరకాల పేర్లు తెరపైకి వచ్చినా.. బొత్స స్థాయిలో ప్రభావం చూపే నేతల మాత్రం ఎంత మాత్రం లేరని చెప్పవచ్చు.ప్రస్తుతం ఉత్తరాంధ్రలో పెద్దదిక్కుగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు . సుదీర్ఘకాలం ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి మంత్రిగా పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో ఓ సాధారణ సర్పంచ్ చేతిలో ఓడిపోయారు. అది కూడా దారుణంగా 52 వేల ఓట్ల తేడాతో. ఆయన గెలిచినప్పుడు మాత్రం చాలా తక్కువ మెజారిటీతో బయటపడుతున్నారు. పైగా మునుపటి మాదిరిగా ధర్మాన దూకుడుగా వ్యవహరించలేకపోతున్నారు. ఆయన కేవలం శ్రీకాకుళం జిల్లా నేత మాత్రమే. ఉత్తరాంధ్ర పై ప్రభావం చూపేటంత శక్తి, బలం లేదన్నది ఒక బహిరంగ రహస్యం. ఆయన తమ్ముడు కృష్ణ దాస్ పరిస్థితి కూడా అంతే. పోనీ తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేద్దాము అంటే ఆయన వాగ్దాటి వరకే పరిమితం. కేవలం శ్రీకాకుళం జిల్లా వరకే ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. డాక్టర్ సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్నాథ్ వంటి నేతలు ఉన్న ఎంత మాత్రం ప్రభావం చూపలేరు. అయితే ఇప్పుడు బొత్స కు అనారోగ్యం కావడంతో ఏదో ఒక నాయకుడికి ఇప్పుడు బొట్టు పెట్టాల్సిందే. లేకుంటే మాత్రం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలపడే అవకాశాలు సన్నగిల్లుతాయి.

# కమలం గూటికి కామ్రేడ్లు..

కోల్ కత్తా, మార్చి 2, (న్యూస్ పల్స్)

భారత రాజకీయాల్లో సిద్ధాంతపరంగా లెఫ్ట్, రైట్ పార్టీలు కమ్యూనిస్టులు, బీజేపీ. రెండు పార్టీల్లో ఉన్నవారు ఉప్పునిప్పులా ఉంటారు. కానీ విచిత్రం బీజేపీ కమ్యూనిస్టుల క్యాడర్ ను తమలో కలిపేసుకుంటోంది. ఇదేం మాయ అని అందరూ ఆశ్చర్యపోవాల్సి వస్తోంది.ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటలుగా ఉన్న త్రిపుర, పశ్చిమ బెంగాల్, ప్రస్తుతం కేరళలో బీజేపీ అనూహ్యంగా బలపడటం వెనుక ఒక పక్కా రాజకీయ మాయాజాలం కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్, త్రిపురలలో కమ్యూనిస్టుల పతనం తర్వాత క్షేత్రస్థాయి కేడర్‌కు రక్షణ కరువైన వేళ, అధికార తృణమూల్ కాంగ్రెస్ వంటి శక్తుల దాడులను తట్టుకోవడానికి వారు బలమైన ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆశ్రయించారు. కానీ కేరళలో మాత్రం భిన్నమైన వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోంది.కమ్యూనిస్టుల ఓటు బ్యాంక్ నిరుపేదలు. పోరాటాలు చేస్తారు కానీ ఆ ఫలితాలు వస్తాయో రావో తెలియదు.కానీ మోదీ.. ఆ పోరాటాలు లేకుండానే వారికి కావాల్సినవి సమకూరుస్తున్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమం అనే నినాదాలను బీజేపీ తనదైన శైలిలో అందిపుచ్చుకుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న ఉచిత బియ్యం, గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు వంటి పథకాలు కమ్యూనిస్టుల సంప్రదాయ ఓటు బ్యాంకైన పేదలు, కార్మికులను సూటిగా ఆకర్షించాయి. దీనికి సాంస్కృతిక జాతీయవాదం తోడవడంతో, అంతర్జాతీయవాదం కంటే దేశభక్తి, భద్రత వైపు ప్రజలు మొగ్గు చూపారు. సిద్ధాంతాల కంటే దైనందిన జీవితంలో స్పష్టమైన మార్పును చూపడం ద్వారా బీజేపీ కమ్యూనిస్టుల పునాదులను కదిలించగలిగింది.కేరళలో ఇప్పటికీ సీపీఎం, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగుతున్నప్పటికీ, బీజేపీ ఓటు శాతం నిలకడగా పెరుగుతోంది. శబరిమల వంటి భావోద్వేగ అంశాలు, స్థానిక హిందూ ధర్మ రక్షణ నినాదాలతో కమ్యూనిస్టు అనుకూల హిందూ ఓటర్లను తనవైపు తిప్పుకోవడంలో బీజేపీ విజయం సాధిస్తోంది. త్రిపురలో 25 ఏళ్ల కమ్యూనిస్టు పాలనను కూల్చిన వ్యూహాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తూ, మూడవ ప్రత్యామ్నాయం నుండి ప్రధాన ప్రత్యర్థిగా ఎదిగేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. సామాజిక వర్గాల వారీగా ఓట్లను చీల్చడం ద్వారా కమ్యూనిస్టు పట్టును సడలించడం ఈ వ్యూహంలో భాగం.కమ్యూనిస్టు నేతలు ప్రజలకు దూరమై, గ్రామాల్లో శూన్యం ఏర్పడిన చోట రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖలు సేవా కార్యక్రమాల ద్వారా పాతుకుపోయాయి. గ్రామస్థాయిలో ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, కమ్యూనిస్టుల పనితీరును అధ్యయనం చేసి వారి ఎత్తుగడలనే చిత్తు చేస్తూ ఆరెస్సెస్ కార్యకర్తలు బీజేపీకి మార్గం సుగమం చేస్తున్నారు. ఈ పక్కా ప్రణాళికతోనే కమ్యూనిస్టులను బలహీనం చేస్తూ, వారి కోటల్లోనే బీజేపీ తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ముందు ముందు కమ్యూనిస్టులు మరింత బలహీనపడటం ఖాయంగా కనిపిస్తోంది.

# కాణిపాక ఆలయానికి మహర్దశ

కాకినాడ, మార్చి 2,



ఏపీలో ప్రముఖ పుణ్యక్షేత్రం చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. స్వామి వారి ఆలయంలో ప్రస్తుతం ఉన్న గోశాలతో పాటు కొత్తగా మరో గోశాల ఏర్పాటు కానుంది. అందుకు 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి గోశాలను ఏర్పాటు చేయనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ వెల్లడించారు. ఆలయ ఛైర్మన్ ఎం.మణి నాయుడుతో కలిసి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు .అందుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన రూ.141.65 కోట్ల ఆలయ బడ్జెట్ అంచనాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. తవణంపల్లె మండలం కె.పట్నం వద్ద ఆలయానికి 18.60 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఇటీవల ఏపీ ప్రభుత్వ కేబినేట్ తీసుకున్న నిర్ణయంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటుగా ఆలయంలో భూగర్భ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కాంట్రాక్ట్ బేసిస్ కింద పని చేస్తున్న 109 మంది ఉద్యోగులను యథావిధిగా పాత పద్ధతిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ఆలయ కమిటీ తరపున లేఖ రాస్తామని వివరించారు.

ఇక తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం (ఫిబ్రవరి 28) టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, డ్రై ఐలాండ్ నిర్మాణానికి రూ.20.17 కోట్లు మంజూరు చేస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పనిచేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించే విషయమై ఏపీ ప్రభుత్వానికి నివేదించాలని డిసైడ్ అయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, ఆసుపత్రులు, సత్రాలు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని పరిపాలన భవనంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు రూ.10.75 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో నూతన ఎక్స్-రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

# ఎక్కడికక్కడ విమానాలు రద్దు

న్యూఢిల్లీ మార్చి 2,

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు ఇప్పుడు భారతీయ ప్రయాణ ప్రణాళికలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. మార్చి 1వ తేదీ ఆదివారం నాడు, భారతీయ విమానయాన సంస్థలకు చెందిన 350 కి పైగా విమానాలు రద్దు అయ్యాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ) తాజా డేటా




ప్రకారం, మధ్యప్రాచ్య గగనతలంలో విధించిన ఆంక్షల కారణంగా విమానయాన రంగంలో ఈ పెద్ద అంతరాయం ఏర్పడింది. ప్రారంభంలో 444 విమానాలు రద్దు అవుతాయని భావించినప్పటికీ, ఈ సంఖ్య 350కి పరిమితం కావడం ఉపశమనం కలిగించింది.ఫిబ్రవరి 28న 410 దేశీయ విమానాలు రద్దు చేస్తున్నట్లు విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలు ఈ అంతర్జాతీయ సంక్షోభం భారాన్ని భరిస్తున్నాయి. ఖుఎ వర్గాల సమాచారం ప్రకారం, ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 100 విమానాలు నిలిచిపోగా, ముంబై విమానాశ్రయంలో 125 విమానాలు రద్దు అయ్యాయి.తాజా ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, భారతదేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలను అప్రమత్తంగా ఉంచారు. మంత్రిత్వ శాఖ, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రయాణీకుల రద్దీని నిర్వహించడానికి, అవసరమైన సహాయం అందించడానికి, ఏదైనా ఊహించని మళ్లింపులను సజావుగా నిర్వహించడానికి విమానాశ్రయాలలో సీనియర్ అధికారులను నియమించారు.ఈ సంక్షోభం దేశీయ మార్గాలకే పరిమితం కాలేదు. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా ఆదివారం 22 అదనపు అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసింది. దీంతో, మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ఎయిర్ ఇండియా రద్దు చేసిన మొత్తం అంతర్జాతీయ విమానాల సంఖ్య ఇప్పుడు 50కి చేరుకుంది. మధ్యప్రాచ్య గగనతలాన్ని ఉపయోగించి ఎంపిక చేసిన అంతర్జాతీయ విమానాల సస్పెన్షన్‌ను ఎయిర్‌లైన్ మార్చి 2 వరకు పొడిగించింది.పరిస్థితిని జాగ్రత్తగా అంచనా వేసిన తర్వాత ఈ ముందు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు ఎయిర్‌లైన్ యాజమాన్యం తెలిపింది. స్పైస్‌జెట్ మార్చి 2, 2026 వరకు భారతదేశం ? యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఙంఇ) మధ్య 33 విమానాలను కూడా రద్దు చేసింది. లుఫ్తాన్సా, ఎమిరేట్స్ వంటి గ్లోబల్ ఎయిర్‌లైన్స్ కూడా కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి.

రీఫండ్ ? రీషెడ్యూల్ కోసం నియమాలు ఏమిటి?

ముందస్తుగా టిక్కెట్లు బుక్ చేసుకున్న, అత్యవసర ప్రయాణాలు చేస్తున్నవారు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే, ఈ క్లిష్ట సమయంలో ఆర్థిక నష్టం నుండి కస్టమర్లను రక్షించడానికి విమానయాన సంస్థలు ప్రయత్నించాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా రెండూ మధ్యప్రాచ్యానికి, అక్కడి నుండి ప్రయాణించేవారికి అదనపు ఖర్చు లేకుండా టిక్కెట్లను రీషెడ్యూల్ చేయడం లేదా పూర్తి వాపసు పొందే అవకాశాన్ని ప్రకటించాయి. మార్చి 7 వరకు ప్రయాణానికి ఫిబ్రవరి 28న లేదా అంతకు ముందు బుక్ చేసుకున్న టిక్కెట్లకు పూర్తి మినహాయింపు వర్తిస్తుందని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు, ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 28 వరకు చేసిన బుకింగ్‌లకు (మార్చి 5 వరకు షెడ్యూల్ చేసిన ప్రయాణానికి) అదే ప్రయోజనాన్ని పొడిగించింది.

# కరెంట్ షాక్ తప్పదా

హైదరాబాద్, మార్చి 2

వేసవి తాపం మొదలవడంతో ఇళ్లలో ఏసీలు, కూలర్ల వాడకం క్రమంగా పెరుగుతోంది. అయితే విద్యుత్తును విచ్చలవిడిగా వాడితే నెలాఖరులో భారీ బిల్లులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ 'గృహజ్యోతి' పథకం వర్తించాలంటే నెలకు 200 యూనిట్ల లోపే వినియోగం ఉండాలి. ఒక్క యూనిట్ ఎక్కువైనా ఈ పథకం వర్తించదు కాబట్టి, వినియోగదారులు పొదుపు మంత్రం పాటించడం ఎంతో ముఖ్యం.పాతకాలపు ఫ్లోర్‌సెంట్ ట్యూబ్‌లైట్లకు బదులుగా ఎల్ఈడీ (ఒఇఆ) బల్బులను వాడటం వల్ల విద్యుత్ ఖర్చు తగ్గుతుంది.ఏసీ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచాలి. ఇన్వర్టర్ ఏసీలు వాడటం వల్ల గది చల్లబడగానే అవి ఆటోమేటిక్‌గా ఆగిపోయి విద్యుత్తును ఆదా చేస్తాయి. వేసవి ప్రారంభానికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించడం మంచిది.ఫ్రిజ్లు, ఏసీలు, ఫ్యాన్లు కొనేటప్పుడు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇచ్చే 5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలను ఎంచుకుంటే బిల్లు తక్కువగా వస్తుంది.అవసరం లేనప్పుడు టీవీలు, కంప్యూటర్లు, ఫ్యాన్లను ఆపివేయాలి. మొబైల్ ఛార్జింగ్ పూర్తయ్యాక ప్లగ్ నుంచి ఛార్జర్‌ను తప్పనిసరిగా తొలగించాలి. రిఫ్రిజిరేటర్లలో సీజన్‌ను బట్టి ఫ్రీజర్ సెట్టింగ్స్ మార్చుకుంటూ ఉండాలి.

# రేవంత్ యూ టర్న్ వెనుక...

హైదరాబాద్, మార్చి 2,

ముందూ వెనుకా ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడం, వాటిని గుట్టుగా అమలు చేయాలనుకోవడం, తీరా అవి బయటపడి వివాదాస్పదమయ్యాక మిన్నకుండిపోవడమో లేదా వెనక్కి తీసుకోవడమో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. హైడ్రా కూల్చివేతల నుంచి ఖమ్మం భూముల వ్యవహారం వరకు ఇదే ధోరణి కనిపించింది. తాజాగా, గత కేసీఆర్ ప్రభుత్వం స్వరూపానంద స్వామికి కేటాయించిన అత్యంత ఖరీదైన కోకాపేట భూముల విషయంలోనూ రేవంత్ సర్కార్ చివరకు వెనక్కి తగ్గాల్సి వచ్చింది.విశాఖ శారదాపీఠం నిర్వాహకులు స్వరూపానంద స్వామి గురించి తెలిసిన వారు చాలా మందే ఉన్నారు. ఆయన పీఠానికి సంప్రదాయ



శారదాపీఠాలతో సంబంధం లేకపోయినప్పటికీ, రాజకీయ పలుకుబడితో ఆయన తన ప్రభావాన్ని చాటుకున్నారు. తొలుత సుబ్బరామిరెడ్డి సౌజన్యంతో, ఆపై తన చతురతతో జగన్, కేసీఆర్ వంటి నేతల వద్ద ప్రాపకం సంపాదించారు. కేసీఆర్ కు ఉన్న ఆధ్యాత్మిక విశ్వాసాలను, హోమాలపై ఉన్న ఆసక్తిని అనుకూలంగా మలచుకుని, రాజశ్యామల యాగాలు నిర్వహించి ప్రతిఫలంగా కోకాపేటలో అత్యంత విలువైన భూములను కేటాయింపజేసుకోగలిగారు.ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డి హయాంలో స్వరూపానంద చలాయించిన పెత్తనం అంతా ఇంతా కాదు. విశాఖలో ఏకంగా ఒక కొండనే రాయించుకోవడమే కాకుండా, తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ భూకేటాయింపులను రద్దు చేసి, కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో ఆయన అక్కడ పట్టు కోల్పోయారు. దీంతో కోకాపేటలో కేసీఆర్ ఇచ్చిన భూమినే తన ప్రధాన కేంద్రంగా మార్చుకోవాలని ఆయన భావించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూకేటాయింపులను రద్దు చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది, కానీ ఆలస్యంగా స్పందించడం వల్ల ఇప్పుడు సమస్య సంక్లిష్టంగా మారింది. 2019లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట (నియోపోలిస్) లోని సర్వే నంబర్ 240లో రెండు ఎకరాల అత్యంత విలువైన భూమిని విశాఖ శారదా పీఠానికి కేటాయించింది. వేద పాఠశాల, రాజశ్యామల ఆలయం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం కేవలం ఎకరా ఒక్క రూపాయికే (మొత్తం రూ. 2) నామమాత్రపు ధరతో ఈ కేటాయింపులు జరిగాయి. మార్కెట్ విలువ ప్రకారం వందల కోట్లు పలికే భూమిని ఇలా ఉచితంగా ఇవ్వడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. హైకోర్టులో కూడా దీనిపై పిటిషన్లు దాఖలయ్యాయి.ప్రస్తుత రేవంత్ సర్కార్ ఈ భూమిని తిరిగి తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకు కొన్ని కారణాలను ప్రభుత్వం చెప్తోంది. కోకాపేట్ నియోపోలిస్ ప్రాంతం సముద్ర మట్టానికి 592 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ ఎత్తైన ప్రదేశంలో రిజర్వాయర్ నిర్మిస్తే, గ్రావిటీ ద్వారా నియోపోలిస్, చుట్టుపక్కల ప్రాంతాలకు పంపింగ్ అవసరం లేకుండా నీటి సరఫరా చేయవచ్చని ప్రభుత్వం చెబుతోంది. రాజకీయ ఒత్తిళ్లతో గత ప్రభుత్వం చేసిన నామమాత్రపు కేటాయింపులను సమీక్షించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.కోకాపేటలో ఎకరం భూమి ధర ప్రస్తుతం సుమారు 150 కోట్ల రూపాయలు. అంటే రెండున్నర ఎకరాల విలువ దాదాపు 400 కోట్ల రూపాయలు. ఈ భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందనే సంకేతాలు రాగానే, స్వరూపానంద చాకచక్యంగా 'హిందూత్వం' కార్డును ప్రయోగించారు. తొలుత అధికారులు సంప్రదించినప్పుడు కోకాపేట భూమిని వదులుకుని, శంషాబాద్ వద్ద రెండు ఎకరాలు తీసుకునేందుకు ఆయన అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ చివరి నిమిషంలో ఇతర రాజకీయ పక్షాలతో రచ్చ చేయించి, పీఠానికి ఇచ్చిన భూములను లాక్కుంటున్నారనే ప్రచారం మొదలుపెట్టారు. దీంతో డిఫెన్స్‌లో పడ్డ రేవంత్ ప్రభుత్వం.. పీఠానికి ఇచ్చిన భూములను వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ప్రకటించింది. ఫలితంగా, ఎకరానికి కేవలం ఒక రూపాయి చొప్పున కేసీఆర్ కేటాయించిన ఆ విలువైన భూమిలోనే ఇప్పుడు ఈ స్వయం ప్రకటిత పీఠాధిపతి తన సామ్రాజ్యాన్ని కొనసాగించబోతున్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లోని అస్థిరత స్వరూపానందకు వరంగా మారింది.

# కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు

హైదరాబాద్, మార్చి 2, (న్యూస్ పల్స్)

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా




కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది '' అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

# రికార్డులు బ్రేక్..

## అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు

హైదరాబాద్, మార్చి 2,

తెలంగాణలో విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇవాళ 6,267 మెగావాట్లకు చేరుకుంది. దీనికి కారణంగా ఎండల తీవ్రత పెరగటమేనని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విద్యుత్ వినియోగం ఉంటుందని అందుకు



అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 తర్వాత నుంచే ఎండలు భగ భగ మండుతున్నాయి. మధ్యాహ్నం సమయానికి కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి చివరి వారంలో శనివారం గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు నమోదు అయింది.తాజాగా ఆ రికార్డు సైతం చెరిగిపోయింది. ఇవాళ చరిత్రలోనే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదైనట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. శనివారం నమోదైన హై పీక్ డిమాండ్ కొన్ని గంటల వ్యవధిలోనే అధిగమించిపోయిందని చెప్పారు. టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని వెల్లడించారు. అయినా సరే ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు తాము ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.డిమాండ్ ఎంత పెరిగినా విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, దిశానిర్దేశంతో తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు.కాగా, ఈ ఏడాది వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. మార్చి చివరి వారం నుంచి మే వరకు వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# తలనొప్పిగా మారిన రాజ్యసభ ఎలక్షన్స్

హైదరాబాద్, మార్చి 2,

తెలంగాణ కాంగ్రెస్‌లో రాజ్యసభ సీట్ల ఎంపికపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఆశావహులు పెద్దఎత్తున ఉండడంతో ఎవరిని అదృష్టం వరిస్తుందోనని గాంధీభవన్ లో ఉత్కంఠ నెలకొంది. ఖాళీ అవుతున్న 2 రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి తమకున్న బలంతో ఒక సీటు ఏకపక్షంగా దక్కనుంది. అయితే, రెండో సీటును దక్కించుకోవాలంటే అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కోసం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కేవలం సామాజిక సమీకరణాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో పార్టీకి అండగా నిలిచే నేతల వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.ఒక రాజ్యసభ స్థానాన్ని గెలవడానికి కనీసం 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఒక సీపీఐ ఎమ్మెల్యే, ఏడుగురు ఎంఐఎం సభ్యుల మద్దతుతో ఈ సంఖ్య 74కు చేరుతుంది. మొదటి సీటును 40 ఓట్లతో గెలిచిన తర్వాత, కాంగ్రెస్ వద్ద మిగిలేది 34 ఓట్లు మాత్రమే. రెండో సీటు గెలవాలంటే మరో 6 ఓట్లు అదనంగా అవసరం. మరోవైపు.. విపక్షాలకు కూడా రెండో సీటును కైవసం చేసుకునేంత బలం లేదు. బీఆర్ఎస్ కు 36 మంది ఎమ్మెల్యేలు ఉండగా. అందులో దాదాపు 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. బీజేపీకి 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఈ సీటును దక్కించుకోవడం బీఆర్ఎస్, బీజేపీకి వీలు కాదు. అందుకే తమతో కలిసొచ్చే పార్టీలతో కలిసి కాంగ్రెస్ రెండో స్థానాన్ని కూడా కైవసం చేసుకునే అవకాశం ఉంది.పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయగల, చట్టపరమైన అంశాలపై పట్టున్న నేతలను పంపాలని హైకమాండ్ భావిస్తోంది. ఈ క్రమంలో ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రేసులో అభిషేక్ మను సింఘ్వీ ఫస్ట్ ప్లేస్ లో ఉన్నారు. ఆయన స్థానమే ఇప్పుడు ఖాళీ అవుతుండగా, ఆయన్ను మరోసారి రాజ్యసభకు పంపించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్టు సమాచారం. పార్టీకి జాతీయ స్థాయిలో ట్రబుల్ షూటర్‌గా సింఘ్వీ ఉన్నారు. ఇక సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు కూడా గట్?గా వినిపిస్తోంది. తెలంగాణ వ్యక్తి కావడం, ఇటీవల ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడం ఆయనకు కలిసొచ్చే అంశాలు.అధిష్ఠానం పారాచూట్ అభ్యర్థులను దింపాలని చూస్తుంటే, రాష్ట్ర నేతలు మాత్రం స్థానిక సమీకరణాలను తెరపైకి తెస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుండి పార్టీని నమ్ముకున్న వీ.హనుమంతరావు వంటి సీనియర్లు, ఈసారి బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు గట్టిగా వినిపిస్తోంది. అలాగే సీనియర్ నేతలు జానారెడ్డి, కోదండరెడ్డి కూడా తమ సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 'స్థానికత వర్సెస్ జాతీయ అవసరాల' మధ్య నలిగిపోతోంది. ఒకవేళ ఇద్దరు అభ్యర్థులను బయటి నుంచి లేదా న్యాయ నిపుణులను ఎంపిక చేస్తే, కష్టకాలంలో పార్టీని కాపాడిన స్థానిక నేతల్లో అసంతృప్తి చెలరేగే ప్రమాదం ఉంది. మరోవైపు, రెండో సీటును గెలవాలంటే ఎమ్మెల్యేలందరినీ ఏకతాటిపైకి తెచ్చి క్రాస్ ఓటింగ్ జరగకుండా చూసుకోవడం రేవంత్ రెడ్డికి పెద్ద పరీక్ష కానుంది.వచ్చే రెండు రోజుల్లో సోనియా గాంధీ, ఖర్గే తుది నిర్ణయం తీసుకోనున్నారు

# బండి.. భాగ్యలక్ష్మి టెంపుల్ విజిట లెక్కేటి

హూదరాబాద్, మార్చి 2,

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజయ పరంపర వెనుక ఒక బలమైన దైవ రహస్యం ఉంది. కరీంనగర్ కంచుకోటలో మహాశక్తి కొలువు తీర్చినా, భాగ్యనగర నడిబొడ్డున భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత మోకరిల్లినా.. ఆయన వేసే ప్రతి అడుగు ఒక గెలుపు పిలుపుగా మారుతోంది. కార్పొరేటర్ స్థాయి నుండి నేడు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయి వరకు ఎదిగిన సంజయ్ ప్రస్థానంలో, 'భాగ్యలక్ష్మి అమ్మవారే' తన విజయలక్ష్మి అని ఆయన ప్రగాఢ నమ్మకం. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ 'హిందూ హృదయ సామ్రాట్' సెంటిమెంట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రయాణంపై ప్రత్యేక కథనం..బండి సంజయ్ రాజకీయ ప్రయాణం కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు ఎదిగింది అంటే, దానికి ఆయన పోరాట పటిమతో పాటు అమ్మవారిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం కూడా ఒక కారణం.

కరీంనగర్ మహాశక్తి ఆలయం కార్పొరేటర్‌గా ఉన్న కాలంలోనే కరీంనగర్‌లో మహాశక్తి ఆలయ నిర్మాణానికి సంకల్పించడం ఆయన ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. ఎంపీగా బాధ్యతలు చేపట్టాక ఆ సంకల్పాన్ని పూర్తి చేసి, ప్రతి ఏటా శక్తి మాల ధరించి అమ్మవారి సేవలో తరించడం ఆయనకు ఒక ఆనవాయితీగా మారింది.హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు బండి సంజయ్ పాలిట విజయలక్ష్మిగా నిలిచారు.ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు అమ్మవారిని దర్శించుకోవడం. కీలకమైన రాజకీయ నిర్ణయాలు లేదా పోరాటాల సమయంలో ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మి ఆలయం నుండే అడుగులు వేశాడు. వరుస విజయాలు రెండు సార్లు ఎంపీగా, జీహెచ్ఎంసీలో పార్టీ బలోపేతం ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి.

# ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ వ్యూహాలు

హైదరాబాద్, మార్చి 2,

ఉద్యమ ప్రస్థానంలో పుట్టిన పార్టీ టీఆర్ఎస్. తర్వాత అది కాస్తా బీఆర్ఎస్ గా మారింది. ఎప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడిన జై తెలంగాణ నినాదంతో నెట్టుకుంటూ వచ్చిందీ పార్టీ. అయితే రోజులు మారాయి. పదేళ్లపాలన తర్వాత కూడా విమర్శలు వస్తున్నప్పుడు జై తెలంగాణ నినాదంతో ముందుకెళ్లాలంటే కుదరదు. ఆవిషయాన్ని హైకమాండ్ గుర్తించింది. దీంతో సెంటిమెంట్ నుంచి సమస్యలపై పోరాటం దిశగా శ్రేణులను కార్యోన్ముఖుల్ని చేస్తున్నారు పార్టీ అధినేత కేసీఆర్.పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి మొదలు పెట్టాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. అందుకే ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాలకు పరిమితం కాకుండా జిల్లాలపై ఫోకస్ పెంచుతోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు.భూసేకరణ, భూముల వివాదాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం, నాగర్ కర్నూల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే పర్యటనలు ప్రారంభించారు. త్వరలో రైతు ఆత్మహత్యల కుటుంబాలను కూడా పరామర్శించేలా ప్లాన్ చేస్తున్నారు.ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, పార్టీని మళ్లీ నిలబెట్టేందుకు క్రమంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఓటమి కారణాలను విశ్లేషిస్తున్నారు.కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, "మళ్లీ మనదే పాలన'' అనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు.పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోతున్నా, కేసీఆర్ మాత్రం తొందరపడటం లేదు. ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి మండలానికి ఇన్‌ఛార్జ్‌లను నియమించాలనే ఆలోచనలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు.ఓటమి తర్వాత వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన బీఆర్ఎస్, ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి వస్తోంది. కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్, కేటీఆర్ గ్రౌండ్ యాక్టివిటీ, కొత్త నాయకత్వం కలయికతో గులాబీ దళం మళ్లీ బలపడుతుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## అంగన్వాడీ సూపర్వైజర్ పై వేధింపుల ఆరోపణలు

నల్గొండ మార్చి 2,

నకిరేకల్ అంగన్వాడీ సెక్టార్ సూపర్వైజర్ జి సునీత ఆగడాలు మితిమీరాయని బాధితులు ఆరోపించారు. అంగన్వాడీ టీచర్లను వేధిస్తున్నట్లు ఆరోపించారు. అంగన్వాడీ టీచర్ల ను వర్గాలుగా విభజించి రాజకీయం చేస్తున్నాట్లు విమర్శించారు. తనకు అనుకూలంగా ఉన్న వర్గానికి ఇష్టానుసారంగా సెలవులు ఇస్తున్నారని అంగన్వాడి టీచర్ నాగమణి అంటున్నారు. ఇదంతా నాపై కుట్ర ని సెక్టార్ సూపర్వైజర్ సునీత అంటున్నారు. అంగన్వాడి టీచర్ నాగమణి భర్త దొడ్డయ్య తన తో దురుసుగా ప్రవర్తించాడు. ఇది బయట పెడుతుందనే ముందస్తుగా నా పైన కుట్ర అని సునీత ఆరోపణ.

## చెట్టును ఢీకొన్న బైకు ఇద్దరు మృతి

అదిలాబాద్ మార్చి 2,

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ధనోర (బి) రహదారి మూల మలుపు వద్ద చెట్టును బైకు ఢీకొట్టింది. ఘటనలో ఓ మహిళ, ఓ యువకుడు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని సిపిఆర్ చేసి ప్రాణాలు రక్షించే ప్రయత్నం చేసారు. ప్రమాద స్థలం వద్దకు ఇంద్రవెల్లి పోలీసులు చేరుకున్ననారు. . కేసు నమోదు చేసి దర్యాప్తు. పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మూల మలుపు దగ్గర తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

## సంపూర్ణ చంద్ర గ్రహణం మంగళవారం యాద్రాద్రి ఆలయం మూసివేత

యాదగిరిగుట్ట మార్చి 2,

మంగళవారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మూసివేయనున్నారు.

ఆలయ ఈఓ భవాని శంకర్ మాట్లాడుతూ × రేపు ఉదయం 7 గంటల నుండి ఎల్లుండి ఉదయం 3 గంటల వరకు ఆలయం మూసివేస్తాం. ఎల్లుండి ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ ఆలయ శుద్ధి చేయనున్నామని అన్నారు. సంప్రోక్షణ ఆలయ శుద్ధి అనంతరం నిత్యా పూజలు నిర్వహించి భక్తులను స్వామి వారి దర్శనాలకు అనుమతించనున్నారు

## వికారాబాద్లో రాహుల్ గాంధీ పర్యటన సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు

వికారాబాద్ మార్చి 2,

వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలంలోని అనంతగిరి ప్రాంతంలో ఉన్న హరిత హోటల్ లో తెలంగాణ?ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల ట్రైనింగ్ సెంటర్ ముగింపు కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ హాజరు అయిన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఈ భద్రతా చర్యలు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాహుల్ గాంధీ వచ్చే మార్గంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోగులను పోలీసులు అడ్డుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర వైద్యం కోసం వెళ్లే వారికీ అనుమతి ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

అదే మార్గంలో ఉన్న ఎస్ఏపీ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులను కూడా పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. పరీక్షల సమయానికి ఆలస్యం అవుతుందన్న ఆందోళనతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇక రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా నిరసనలు జరిగే అవకాశాలు ఉన్నాయని భావించిన పోలీసులు పలువురిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు తెలిసింది. భద్రతా చర్యలు అవసరమే అయినప్పటికీ, అత్యవసర సేవలు మరియు విద్యార్థుల పరీక్షలకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

## రింగ్ రోడ్డు లో ప్రమాదం..ఇద్దరికి గాయాలు

హైదరాబాద్ మార్చి 2,

ఎల్బినగర్ సాగర్ రింగ్ రోడ్డు వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తూ ముందు ఉన్న డిసిఎం ను కారు ఢీకొని పల్టీ కొడుతూ డివైడర్ను ఢీకొంది. దాంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. కారులో ఉన్న డ్రైవర్ సాయి కీర్తన్ కు మంటలు అంటుకొని తీవ్ర గాయాలు కావడంతో ఎల్బినగర్ కామినేని హాస్పిటల్ కి తరలించారు. డీసీఎం డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. మంటల ధాటికి కారు పూర్తిగా దగ్ధమైంది. సాయి కీర్తన్ ను ఎల్బినగర్ రాక్ టౌన్ కాలనీకి చెందినవాడుగా గుర్తించారు. అతివేగం ప్రమాదనికి కారణమని తెలుస్తుంది

## పొద్దుటూరులో 10 తరగతి విద్యార్థి ఆత్మహత్య

కడప మార్చి 2,

ప్రొద్దుటూరు మోడంపల్లిలోని ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వసతిగృహంలోని చెట్టుకు ఉరేసుకుని విద్యార్థి నరసింహులు ఆత్మహత్య చేసుకున్నాడు. వసతిగృహం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో మృతుడు పదో తరగతి చదువుతున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

# కాళేశ్వరం, మేడిగడ్డ సంగతేంటీ...



కరీంనగర్, మార్చి 2,

కాళేశ్వరం.. తెలంగాణలో గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టు. కేవలం నాలుగేళ్లలో నిర్మాణం పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించారు. నీటి ఎత్తిపోతలు కూడా రెండేళ్లు సక్రమంగానే చేశారు. కానీ, మూడో ఏడాది ప్రాజెక్టులో కీలక బ్యారేజీ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్లకు సమీపంలో బుంగలు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రెండున్నరేళ్లుగా బ్యారేజీలు ఖాళీగా ఉంటున్నాయి. ఎల్లంపల్లి నుంచే నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకు బ్యారేజీ కుంగుదల ప్రచారాస్త్రంగా మారింది. దీంతో ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. కాళేశ్వరంలో అవినీతి, అక్రమాలను నిగ్గ తేల్చేందుకు జుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఏడాదిపాటు విచారణ చేసిన కమిషన్ నివేదిక కూడా ఇచ్చింది. కానీ రేవంత్ ప్రభుత్వం దానిపై కేంద్రానికి లేఖ రాసింది.ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి 2016లో బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించింది. 20 లిఫ్టులు, 19 పంప్ హౌస్‌లు, 20 రిజర్వాయర్లతో 280 టీఎంసీల నీటిని మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు ఎత్తిపోయించేలా రూపొందించారు. 1.47 లక్షల కోట్ల ఖర్చుతో 18.25 లక్ష ఎకరాలకు నీటి సరఫరా లక్ష్యం నిర్మాణం చేపట్టారు. 139 మెగావాట్ల బాహుబలి మోటార్లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 12 సబ్‌స్టేషన్లు ప్రత్యేకంగా నిర్మించారు.

అవినీతి ఆరోపణలు, దర్యాప్తు

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో భారీగా అవినీతి జరిగిందని కాంగ్రెస్, బీజేపీ ఆరోపించాయి. మొదటి నుంచి కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎంగా మారిందని విమర్శించారు. అది నిజమే అన్నట్లు పిల్లర్లు కుంగిపోవడంతో ప్రజలు కూడా మొదట నిజమే అని భావించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఘోష్ కమిషన్ రిపోర్టు మునుపటి ప్రభుత్వంపై ఆర్థిక లోపాలు, కాంట్రాక్టర్లకు అనైతిక లాభాలు తేల్చింది. సీబీఐ దర్యాప్తు ఆదేశించింది,ఏడో బ్లాక్‌లో 16?22 పిల్లర్లు దెబ్బతిని, ఫౌండేషన్లు బలహీనపడ్డాయి. రెండేళ్లుగా మరమ్మతులు చేయలేదు. దీంతో ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. ఈ క్రమంలో కమిషన్ పేరుతో రెండేళ్లుగా ప్రాజెక్టుకు మరమ్మతు చేపట్టకపోవడంపై ప్రజల్లో, రైతుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టను రేవంత్ సర్కార్ నిరుపయోగంగా మార్చిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం సరికాదన్న భావన ప్రజల్లో క్రమంగా బలపడుతోంది.ప్రజల ఒత్తిడి, రైతుల ఆందోళనలతో మొదట 'వృథా' అని చెప్పిన సీఎం, ఇప్పుడు మరమ్మతులకు సిద్ధమయ్యారు. నిర్మాణ సంస్థకు నోటీసులు పంపి మరమ్మత్తులు చేయించుతున్నారు. ప్రాజెక్టు పూర్తి చేసి నీటి ప్రవాహం పునఃప్రారంభం, రైతుల అవసరాలు తీర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.మొత్తానికి కాళేశ్వరం విజయంలో సీబీఐ విచారణ మొదలు కాలేదు. మరోవైపు రెండున్నరేళ్లుగా వృథాగా ఉంటుంది. దీంతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై వ్యతిరేకత వస్తోంది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డికి వేరే ఆప్షన్ లేకుండా పోయింది. దీంతో మరమ్మతులు షురూ చేశారు.

# అన్నారం బ్యారేజిని కూల్చేందుకు కుట్ర
## ఎక్స్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ మార్చి 2,

మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం



బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

ఈ మేరకు ఎక్స్ లో తన వాదాన్ని పోస్టు చేసారు. నిబంధనలకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరం. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి బ్యారేజీని ప్రమాదంలోకి నెడుతుంది రేవంత్ సర్కార్.. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తుంది. తెలంగాణ వనరులను కాంగ్రెస్ పార్టీ ఎలా కొల్లగొడుతుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది. కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే. అందినకాడికి దోచుకో.. దొరికినకాడికి అమ్ముకో.. ఇవే తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా పాలన సూత్రాలు. తెలంగాణను నిలువు దోపిడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులారా.. ప్రజలు మీ భరతం పట్టే రోజు అతి దగ్గరలోనే ఉంది.. ఖబడ్దార్ అని హెచ్చరించారు.

# రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ పర్యటన



అమరావతి మార్చి 2,

నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1,టైప్ -2,గ్రూప్ - డి ఉద్యోగుల క్వార్టర్లను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు.

మంత్రి మాట్లాడుతూ వైసీపీ నా మీద కూడా కేసులు పెట్టింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ లో 2001 లో కొన్న 60 సెంట్ల నా సొంత స్థలం కూడా పోయింది. విజయవాడ సమీపంలో ఈడుపుగల్లు లో ఉన్న నా స్థలం గుండా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుంది. మా వాళ్ళు బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సీఆర్డీయే వాళ్ళు మీ స్థలం లేదని చెప్పారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమాలు జరిగాయని ప్రచారం చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది కాబట్టి...ఎలాంటి కామెంట్స్ చేయనని అన్నారు.

అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం 4026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. వర్షాల వల్ల గత నవంబర్ వరకు పనులు జరుగలేదు . అమరావతిలో ప్రైవేట్ సంస్థలు నిర్మాణ పనులు కూడా చాలా వరకూ జరుగుతున్నాయి. టార్గెట్ ప్రకారం పనులు చేయకపోవడంపై షాపూర్జీ - పల్లోంజి మేనేజ్మెంట్ తో మాట్లాడుతున్నానని వెల్లడించారు.

## హైదరాబాద్ చేరుకున్న రాహుల్ గాంధీ

హైదరాబాద్ మార్చి 2,

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. అయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ లో జరిగే ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ ( ఆఅఅ) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి రాహుల్ బయలుదేరారు.

## 5రష్మిక తో స్వగ్రామానికి విజయ్ దేవరకొండ

నాగర్ కర్నూలు మార్చి 2,

నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు నాగర్ కర్నూల్- బలమూరు మండలం తుమ్మన్పేట చేరుకున్నారు. నూతన ఫామ్ హౌస్లో గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ నేధ్యంలో అభిమానులు, కుటుం సభ్యులు, బందువులు భారీగా తరలివచ్చారు. తుమ్మన్ పేటలో సందడి నెలకొంది.

## శ్రీపాదరావు కు సీఎం రేవంత్ నివాళులు

హైదరాబాద్ మార్చి 2,

ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయనకు నివాళులర్పించారు. విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి, నిస్వార్థ ప్రజాసేవకుడిగా అయన పేరుగాంచారని అన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎం పై డీఎస్పీ పిర్యాదు

అమరావతి మార్చి 2,

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఈనాడు, ఆంధ్రజ్యోతి పలు వార్త సంస్థలపై డీఎస్పీ నాగ వరప్రసాద్ తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. తిరుమల లడ్డు లో జంతు అవశేషాలు కలిపారని పదే పదే ఆరోపణలు చేయడం పై మనస్తాపంతో ఫిర్యాదు చేసినట్టు అయన తెలిపారు. కొన్ని టివి చానెళ్ల యజమానులు పైనా ఫిర్యాదు చేసారు. శ్రీకాకుళం జిల్లా కు చెందిన దేవరకొండ నాగ వర ప్రసాద్ కు అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గా పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అయనమెడికల్ లీవ్ లో ఉన్నారు.

## పసుపు రంగు రాసిన చికెన్ విక్రయిస్తే చర్యలు

హన్మకొండ మార్చి 2,

చికెన్ సెంటర్లలో కోడి మాంసాన్ని శుభ్రం చేసేటప్పుడు పసుపుకు బదులుగా కృత్రిమ రంగులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఫుడ్ ఇన్స్పెక్టర్ బ్రహ్మాజీ హెచ్చరించారు. ఆదివారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్య దర్శి చక్రపాణితో కలిసి ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులు కలిపిన మాంసం తింటే ఉదర, పేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆలయ నిర్మాణానికి 50 లక్షలు విరాళామందించిన బీఆర్ఎస్ నేత

పటాన్ చెరు మార్చి 2,

కన్నవారు, పుట్టిన ఊరు నాకేమిచ్చిందని నిట్టూరుస్తున్న ఈ రోజుల్లో.. తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే విధంగా బ్రతకాలి. పుట్టిన ఊరుకు చేతనైయినంత వరకు సాయం చేయాలి అనే దృఢ సంకల్పంతో సొంత ఊరికి, నిరుపేదలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బిఆర్ఎస్ నేత, రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ మరోసారి హాట్ టాపిక్ గా వార్తల్లో నిలిచారు. పఠాన్ చెరువు నియోజకవర్గం, ముత్తంగి డివిజన్, కర్ధనూర్ గ్రామంలో పురాతన శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది, వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోక శిదిలావస్థకు చేరుకుంటున్న తరుణంలో దాతల కోసం ఆలయ సిబ్బంది, గ్రామస్థులు ఎంతమందిని కలుస్తున్నా పెద్దగా స్పందన లభించకపోవడంతో గ్రామస్థులు నిరూత్సహనిక గురవుతున్నారు. దీంతో ఎక్కడి ఆలయ పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. యూకేజీ నుండి 9 వ తరగతి వరకు చదివిన కర్దనూరు గ్రామం తనకు సొంత గ్రామం లాటిందని.. చరిత్ర కలిగిన సిద్ధి వినాయక ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామస్థులతో పాటు ఆలయ నిర్మాణం బాధ్యతలో నేను సైతం చేయికలుపుతానంటూ రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ ముందుకొచ్చారు. దానంలో కర్ణుడే ఆదర్శం అన్నట్లు ఏకంగా 50లక్షల విరాళాన్ని ప్రకటించి రాజ్ కుమార్ హాట్ టాపిక్ గా నిలిచారు. తక్షణమే ఆలయ పనులు మొదలు పెట్టాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులకు రాజ్ కుమార్ సూచించారు. రాజ్ కుమార్ తీసుకున్న నిర్ణయం పట్ల పార్టీలకు అతీతంగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

==========================

# విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండాలి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి2:

పాఠశాల విద్యార్థులు తమ తమ పాఠ్య పుస్తకాల చదువుతో పాటు శాస్త్ర పరిజ్ఞానంపై ఆసక్తి కలిగి ఉండాలని తెలంగాణ అనుక్షణం దినపత్రిక ఎడిటర్ సంపతి ప్రభాకర్ రావు అన్నారు .సివి రామన్ జయంతి పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సోమవారం వరంగల్ శాంతి నగర్ లోని సన్ రైజ్ స్కూల్ లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన ప్రభాకర్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగంలో దూసుకువెళ్తుందన్నారు . దాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .అందుకే పాఠశాల దశ నుండి విద్యార్థులు సైన్స్ పై ఆసక్తి , అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు ట్రాస్మా స్టేట్ అడ్వైసర్ కొమ్మినేని భూపాల్ రావు , జిల్లా అడ్వైసర్ రాంపెల్లి రవి., జిల్లా ట్రెజరర్ దండపంతుల రామ్ మూర్తి ,డివిజన్ సెక్రటరీ విలియం , పాఠశాల ప్రిన్సిపాల్ భాశెట్టి వెంకటేశ్వర్లు ,కరెస్పాండెంట్ భాశెట్టి శారద



, ఇంచార్జులు బి.వీరాస్వామి ,బి.భవాని , ట్రాస్మా సభ్యులు జి. వరప్రసాద్ ,జె.సంజీవ , పి .స్వామి , విద్యార్థులు పాల్గొన్నారు .

# టి జి ఓ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)మార్చి2:

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకల గోడ పత్రికను ఆవిష్కరించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో), హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ ఐడిఓసి లోని కలెక్టర్ ఛాంబర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించుటకు గోడపత్రికను ఆవిష్కరించారు.

టీజీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా గెజిటెడ్ అధికారులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను ఐ.డి. వో.సి లోని టీజీవో భవన్ లో 3, 4 తేదీల లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలలో మహిళా అధికారులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరుతున్నాము.

వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మార్చి 7న కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చే బహుమతులు ప్రదానం చేయబడును.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్ కుమార్,కార్యదర్శ డాక్టర్ ప్రవీణ్ కుమార్,సహాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మేన శ్రీను, కోశాధికారి రాజేష్ కుమార్, మాధవరెడ్డి, చంద్రశేఖర్, రమేష్ రెడ్డి, టీజీవో వుమెన్ వింగ్ ప్రతినిధులు మాధవి, శ్రీ ప్రియ, పవిత్ర, హేమలత, చేతన, సౌజన్య, రజిత లు పాల్గొన్నారు.

# ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన ఫిట్ ఇండియా కార్నివల్‌కు భారీ ప్రజా స్పందన

విశాఖపట్నం, మార్చి 2(భారత శక్తి ):

క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన రామకృష్ణ బీచ్‌లో నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా కార్నివల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రారంభ రోజునే 4,000 మందికి పైగా పాల్గొనగా, రెండో రోజున కూడా ఉత్సాహంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

కార్నివల్ ప్రజాదరణ పొందిన “సండేస్ ఆన్ సైకిల్” సామూహిక సైక్లింగ్ కార్యక్రమంతో ప్రారంభమైంది. అనంతరం భారీ స్థాయిలో జుంబా మరియు యోగా సెషన్లు నిర్వహించి, ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. అగ్నిమాపక మరియు అత్యవసర సేవల విభాగం ప్రదర్శనలు ప్రజల్లో భద్రతా అవగాహనను పెంచాయి.

రెండో రోజు ఉదయం యోగా, జుంబా మరియు బీచ్ వాలీబాల్ కార్యక్రమాలతో ఉత్సాహం మరింత పెరిగింది. సాయంత్రం అన్ని వయస్సుల వారికి అనుకూలంగా ఫన్ ద ఫిట్‌నెస్ గేమ్స్, బీచ్ క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

భారీగా ప్రజలు పాల్గొనడం మరియు వారి ఉత్సాహభరిత స్పందన ఫిట్ ఇండియా ఉద్యమం పట్ల పెరుగుతున్న నిబద్ధతను, అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించే సందేశాన్ని ప్రతిబింబిస్తోంది.

ఈ కార్నివల్ మార్చి 1 నుండి 3, 2026 వరకు ఆర్‌కే బీచ్‌లో కొనసాగుతూ, “హమ్ ఫిట్ తో ఇండియా ఫిట్” అనే స్ఫూర్తితో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువస్తోంది.

# విజయవాడలో 8వ జన ఔషధి దివస్: అజిత్ సింగ్ నగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 02:

ఎనిమిదోవ జన ఔషధి దివస్ వేడుకల్లో భాగంగా ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (ఖఓఃఎ) ఆధ్వర్యంలో విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న ప్రధానమంత్రి



భారతీయ జన ఔషధి కేంద్రం వద్ద ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ ఆరోగ్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ యేసేబు, ల్యాబ్ టెక్నీషియన్ స్వర్ణలత, ఫార్మాసిస్ట్ నిహారిక సహకారంతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు అందించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు రక్తపోటు (ఃఖ), మధుమేహం (ఒబీఙజీత) వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కన్సల్టేషన్ కల్పించారు.

మొత్తం 128 మంది రోగులు ఈ శిబిరంలో వైద్య సేవలను వినియోగించుకున్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మందులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే జన ఔషధి కేంద్రాల ముఖ్య ఉద్దేశమని, ఈ సందర్భంగా వైద్య బృందం ప్రజలకు అవగాహన కల్పించింది.

జన ఔషధి వారోత్సవాల్లో భాగంగా మార్చి 5 వరకు వివిధ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు కొనసాగన్నాయి.

మార్చి 2: గన్నవరం – బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలోని జనౌషధి స్టోర్.

మార్చి 3: బాపట్ల – విద్యానగర్‌లోని జనౌషధి కేంద్రం.

మార్చి 4: చిలకలూరిపేట – ఎన్ఆర్టీ (ఔఖీ) సెంటర్‌లోని జనౌషధి స్టోర్.

మార్చి 5: గుంటూరు – శ్యామలానగర్‌లోని జనౌషధి కేంద్రం.

మార్చి 6: తెనాలి – గంగనమ్మపేటలోని జనౌషధి స్టోర్ నుండి అవగాహన పాదయాత్ర నిర్వహించనున్నారు.

మార్చి 7: విజయవాడ – ‘8వ జనౌషధి దివస్’ ప్రధాన ముగింపు వేడుకను విజయవాడ డాబాకోట్లు సెంటర్, గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు.

నాణ్యమైన మందులను తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 02 (భారత శక్తి): మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్, చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ములుగు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, ములుగు జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలోని ప్రగల్లపల్లి లో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం లో

బడే నాగజ్యోతి పాల్గొని మాట్లాడారు. అమ్మ జన్మనిస్తుంది రక్తదానం పునర్జన్మనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగల్లపల్లి గ్రామస్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 02: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, జడ్పీ సీఈఓ చందర్ లతో కలసి అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు.

ఈ సందర్భంగా 113 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఆయా శాఖలకు సంబంధించిన భూ సమస్యలు, పెన్షన్ , ఇందిరమ్మ ఇళ్లు, తదితర వాటి పై అర్జీలు స్వీకరించడం జరిగిందని అన్నారు.

సంబంధిత అధికారులు అర్జీదారుని సమస్యను క్షుప్తంగా పరిశీలించి పరిష్కరించాలని, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపండి: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప,మార్చి 02(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు అధికారులు వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని రీ



ఓపెన్ కు అవకాశం ఇవ్వరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు..

సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్ సమావేశపు మందిరం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా,డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో అర్జీలు సమర్పించడంజరుగుతుందని వారికి నాణ్యమైన,సంతృప్తి స్థాయి లో పరిష్కారం చూపే విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. ప్రభుత్వంప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని,ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి కి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగాపరిష్కరించాలన్నారు.అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలనిఅర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగాపరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు వారికి అందిన అర్జీల పరిష్కారానికి సమయం కేటాయించి సమీక్షా చేయాలన్నారు. అర్జీల పరిష్కారం లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

×ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు:

1) ఎర్రగుంట్ల మండలం హనుమాన్ గుత్తి గ్రామానికి చెందిన జి. గంగాధర్ తాను వికలాంగుడని,తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

2) తొండూరు మండలం బూచుపల్లి గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు తన కుమార్తె పి. రాఘవి ఔఇఖ పరీక్షకు ఈ నెల 7వ తేదీకి కుల ధృవీకరణ పత్రం అవసరం ఉందని, అందువల్ల కుల ధృవీకరణ పత్రం జారీ చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

3) నందలూరు గ్రామానికి చెందిన కనకరాజు ఎదరపల్లి మండలంలోని సర్వే నంబర్లు 1151, 1152లో అం-410 కింద సీట్లాట్ ఏర్పాటు చేసి చెట్లు నాటే పనులకు అనుమతి పొందారు. ఈ పనుల కొరకు ప్రభుత్వం సంబంధిత మెటీరియల్ మరియు నిర్వహణ ఖర్చుల బిల్లులు మంజూరు చేయవలసిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ.పి.డి. జి.రాజ్యలక్ష్మి,మెప్మా పిడి కిరణ్ కుమార్,పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, కో-ఆపరేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 02:



"మేరా యువ భారత్-మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ " ఆధ్వర్యంలో,నేషనల్ సైన్స్ డే అనే కార్యక్రమాన్ని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఏలూరు లో నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ జి గిరిబాబు గారు గారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సైన్స్ అనేది మానవ జీవితంలో ఎంత ముఖ్య పాత్ర పోషిస్తుందో మానవునికి ఏ విధంగా దోహదపడుతుందో వివరించారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటేషన్ నిర్వహించారు ఈ కాంపిటీషన్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సెట్ వెల్ సీఈవో ప్రభాకర్ గారి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ అజయ్ బాబు గారు ,ఎకనామిక్స్ రాంబాబు గారు ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్ కుమార్ గారూ, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు దుర్గాప్రసాద్ గారురావు గారు,అండ్ కాలేజ్ స్టాఫ్ మైభారత్ యువ వాలంటీర్ చేతన తదితరులు పాల్గొన్నారు .

# డి.ఎన్.ఆర్. కళాశాలలో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 02:డి.ఎన్.ఆర్. కళాశాలలో"50 సంవత్సరముల జాతీయ అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి శాస్వత పాఠాలు" అనే అంశము పై



పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026 ను పశ్చిమ గోదావరి జిల్లా యువజన సర్వీసుల అధికారి శ్రీ సుంకర రాము గారి ఆద్వర్యములోపశ్చిమ గోదావరి జిల్లా నుంచి సుమారు 75 మంది విధ్యార్ధుల వక్తృత్వ పోటీలలో పాల్గొనగా అందులో ఐదుగురు విధ్యార్ధులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగినదని ప్రిన్సిపాల్ శ్రీ జి. మోజెస్ తెలిపారు.

ఈ కార్యక్రమమును నిర్వహించిన వారిని కళాశాల అధ్యక్షులు శ్రీ జి వి నరసింహరాజు, కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ శ్రీ జి. సత్యనారాయణ రాజు పాలకవర్గ సభ్యులు అభినందించారు.

ఈ సందర్భంగా యువజన అధికారి మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లో బాగంగా యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసుకొని రావడానికి, అత్యవసర పరిస్థితి మరియు ప్రజాస్వామ్యం పై అవగాహన కల్పించడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షులు శ్రీ పాండురంగ రాజు మాట్లాడుతూ ఇటువంటి వక్తృత్వ కార్యక్రమాల వలన యువత భాధ్యతాయుతమైన పౌరులుగాను, సమర్ధవంతమైన నాయకులుగాను, భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చేందిన దేశముగా మార్చడానికి ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు.

కళాశాల పాలకవర్గ సభ్యులు మరియు పరిపాలనాధికారి శ్రీ పి.రామకృష్ణం రాజు మాట్లాడుతూఈ కార్యక్రమం వలన ప్రజాస్వామ్య విలువల ప్రాముఖ్యతను, న్యాయపరమైన పాఠాలు గుర్తు చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థ ఎలా పనిచేస్తుంది, దానిని కాపాడటంలో పౌరుల పాత్ర గురించి వివరించారు.

ఎన్.ఎస్.ఎస్. అధికారి శ్రీ ఎస్. అనిల్ దేవ్ మాట్లాడుతూ, "50 సంవత్సరాల జాతీయ అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి శాశ్వత పాఠాలు" అనే అంశాన్ని 1975లో ప్రకటించిన అత్యవసర పరిస్థితికి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ కాలంలో ప్రజాస్వామ్య సంస్థల బలహీనతలు బయటపడినప్పటికీ, భారత ప్రజాస్వామ్య బలం కూడా స్పష్టమైనది అని, ఈ అనుభవం స్వేచ్ఛ, బాధ్యతాయుత పాలన మరియు రాజ్యాంగ పరిరక్షణ ప్రజాస్వామ్య రక్షణకు ఎంతో అవసరమని మనకు గుర్తు చేస్తుందని వివరించారు.

ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా. జ్యోతి, డా.ఉషారాణి, ఎన్. ఎస్. ఎస్. అధికారి శ్రీ కె.సోమయ్య, అధ్యాపకులు శ్రీ జి. రంగా రావు, శ్రీ పి. హరికృష్ణం రాజు, శిరీష్ కుమార్, జె. సురేష్, శ్రీమతి జి.భవాని, శ్రీ ఇ.భరత్,

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 02 (భారత శక్తి)ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలు గుర్తించి, నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ప్రారంభమైన యూరియా బుకింగ్ యాప్ ద్వారా, ఇప్పటివరకు రైతులు, 1 లక్షా 60 వేల యూరియా బస్తాలు బుక్ చేసుకొని, 1 లక్షా 40 వేల యూరియా బస్తాలు తీసుకున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందున, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత మండలాల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. సీఎం కప్ పోటీలలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 4 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 13 కాంస్య పతకాలు కలిపి మొత్తం, 25 పతకాలు రావడం గర్వకారణం అని తెలిపారు. ఇందుకుగాను, అధికారులకు, కోచ్ లకు, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

అంతకుముందు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన డిసిఓ నర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కలెక్టర్, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా అధికారి మృతి చెందడం బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ నిర్మూలన ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 02(భారత శక్తి) నిర్మల్ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన, 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు.

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో "బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రచార రథం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రజలందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శరత్ కుమార్, రాజు, బాలల పరిరక్షణ అధికారి మురళి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, మిషన్ శక్తి సిబ్బంది, విజన్ సంస్థ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కార మార్గం చూపాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 02 (భారత శక్తి) : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.





సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు(స్థానిక సంస్థలు) లతో కలిసి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 14, ఇందిరమ్మ ఇండ్లు 14, పెన్షన్ 14, ఉద్యోగల కల్పన 04, ఇతర శాఖలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు అందాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వంటి అంశాలను సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు.

అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మండల ప్రత్యేక అధికారులు, ఎంపి డి ఓ లు, ఎంపి ఓ లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇళ్లను వెంటనే మిగతా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తయిన ఇండ్లను వారానికి 10 చొప్పున గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓ లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 2:




ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అలాగే రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 25 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారి 7, డి డబ్ల్యు ఓ 7, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 6,మిగిలిన 38 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 83 దరఖాస్తులు

వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు.ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, ఇన్చార్జి సీఈఓ శిరీష, ఆర్డీవో వేణుమాధవ్ రావు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్, డిఇఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు,కే. దయానంద రాణి, నరసింహ, అధికారులు, సిబ్బంది,తదితరులు హాజరైనారు.




# నెక్ట్స్ షెడ్యూల్ మేలో!




రెబల్‌స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' కోసం ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా ఎదురు చూస్తున్నారు. ఏ చిన్న అప్‌డేట్ వచ్చినా సోషల్ మీడియా షేక్ అయిపోతుంది. అయితే గతేడాది చివర్లో ఈ మూవీ షూటింగ్ అధికారికంగా స్టార్ట్‌అయినప్పటికీ, ప్రస్తుతం చిత్ర నిర్మాణ పనులకు మాత్రం చిన్న బ్రేక్ లభించింది. దర్శకుడు సందీప్ వంగా నటీనటుల ఎంపిక, ఇతర ప్రీప్రొడక్షన్ పనుల్లో ఉండటమే దీనికి ప్రధాన కారణం. మరోవైపు ప్రభాస్ 'ఫౌజీ', 'కల్కి 2898 ఏడీ: పార్ట్ 2' పనులతో ఫుల్‌బిజీగా ఉన్నాడు. అయితే 'స్పిరిట్' కోసం ప్రభాస్ ఒక సరికొత్త మేకోవర్ ప్రయత్నిస్తున్నాడు. ఈ సినిమాలో ఆయన ఒక పవర్‌ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. ఇందుకోసం ఆయన తన ఫిజిక్‌ను మరింత ఫిట్‌గా, ఇంటెన్స్‌గా మార్చుకునే పనిలో ఉన్నాడు. ఇక లేటెస్ట్‌అప్‌డేట్స్‌ప్రకారం.. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ఈ ఏడాది మే ఫస్ట్‌వీక్ లో ప్రారంభం కానున్నట్లు సమాచారం. అప్పటి నుంచి ఎటువంటి బ్రేక్ లేకుండా షూటింగ్ జరపాలని మేకర్స్‌భావిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసేందుకు సన్నాహకాలు చేస్తున్నారు.

# అంటార్కిటికాలో కలుద్దాం



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నటించిన తాజా హాలీవుడ్‌యాక్షన్ చిత్రం ద బ్లఫ్. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతూ మంచి ఆదరణ పొందుతోంది. ఇక ఈ సినిమా చూసిన టాలీవుడ్ స్టార్ మహేశ్‌బాబు.. ఆమె నటనపై ప్రశంసన వర్షం కురిపించాడు. ఒక అద్భుతమైన చిత్రం. యాక్షన్, ఎమోషన్స్ చాలా బాగున్నాయి. పీసీ తన నటనతో మరోసారి మెప్పించిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఆయన పోస్టుకు స్పందించిన ప్రియాంక చోప్రా.. థ్యాంక్యూ మహేశ్.. సీ యూ సూన్ ఇన్ అంటార్కిటికా అంటూ బదులిచ్చింది. వీరిద్దరు ప్రస్తుతం ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఆమె ఇచ్చిన హింట్‌తో ఈ సినిమా తదుపరి షెడ్యూల్‌అంటార్కిటికా ఖండంలో ఉంబబోతోందని స్పష్టం అవుతోంది. రుద్ర పాత్రలో మహేశ్‌బాబు, మందానికి పాత్రలో పీసీ నటిస్తున్న ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.

# ఆ ధైర్యంతోనే..



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తన రెండో చిత్రం రాకాస ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. తన సొంత బ్యానర్ పింక్ ఎలిఫెంట్‌పిక్చర్స్ ద్వారా నిర్మించిన మొదటి సినిమా కమిటీ కుర్రోళ్లు హిట్ కొట్టిన విషయం తెలిసిందే. అంతే కాదు ఎన్నో అవార్డులు, రివార్డులు దక్కించుకుంది. అయితే ఆ సినిమాకు తన బాబాయ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో ప్రచారం చేయించుకోవడానికి ఆమె అప్పట్లో చాలా ట్రై చేసింది. కానీ కుదరలేదు. ఇప్పుడు తన రెండో సినిమా ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బాబాయ్‌ని భాగం చేసే విషయమై తన మనసులోని మాట చెప్పింది. ఉస్తాద్ భగత్‌సింగ్‌కు బాబాయ్ డేట్ ఇస్తే.. అందులో ఒకటో, రెండో తాను తీసుకుంటానని నవ్వుతూ చెప్పింది. ముందుగా ఆయన సినిమాలకు ఆయన ప్రచారం చేసుకోవాలని తాను కోరుకుంటానని, ఉస్తాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వస్తే మాత్రం తాను కూడా తన సినిమా కోసం ప్రయత్నిస్తానని తెలిపింది. తాను కాన్ఫిడెంట్‌గా ఇంటి నుంచి బయట అడుగు పెడుతున్నానంటే.. తన కుటుంబం ఉందన్న ధైర్యంతోనే అని పేర్కొంది.

అప్పుడప్పుడు ఆ శబ్దాలు తప్ప..

# దుబాయ్‌లో క్షేమంగానే ఉన్నాం

- మంచు విష్ణు పోస్టు



ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న తరుణంలో, దుబాయ్ లో ఉంటున్న ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణు కుటుంబం పరిస్థితిపై ఆందోళన నెలకొంది. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో విష్ణు కుటుంబం, బంధువులు, స్నేహితులు, అభిమానులు కలవరపాటుకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో, తన సోదరుడు క్షేమంగా ఉండాలంటూ మంచు లక్ష్మీ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. తన భద్రత గురించి అందరూ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంచు విష్ణు 'ఎక్స్' వేదికగా తాను క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు. "మేం క్షేమంగా ఉండాలని కోరుకుంటున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. దుబాయ్‌లో మా కుటుంబం సురక్షితంగానే ఉంది. అప్పుడప్పుడు దూరం నుంచి వచ్చే శబ్దాలు తప్ప, ఎలాంటి ఆందోళనకర పరిస్థితి లేదు. మేం ప్రశాంతంగా ఉన్నాం" అని విష్ణు పేర్కొన్నారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లోనూ ఇక్కడి ప్రభుత్వం ప్రజల రక్షణ కోసం క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యలు అద్భుతమని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పటిష్టమైన నాయకత్వాన్ని కనబరుస్తున్నారంటూ యూఏఈ అధికారులకు మంచు విష్ణు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇరాన్ నుంచి వస్తున్న డ్రోన్లను దుబాయ్‌లో ఇంటర్‌సెప్టర్లు అడ్డుకుంటున్న వీడియోను మంచి విష్ణు అంతకుముందు ట్వీట్ చేశారు.

సొంత ఊరిలో 'విజయ్ రష్మిక' సందడి..

# కొత్త ఇంట్లోకి గృహప్రవేశం..



టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు వివాహం తర్వాత తొలిసారి విజయ్ స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్ పేటకు చేరుకున్నారు. ఈ ఉదయం గ్రామానికి చేరుకున్న ఈ నూతన వధూవరులకు గ్రామస్థులు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో డప్పు వాయిద్యాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఫామ్ లో నూతనంగా నిర్మించిన గృహంలోకి విజయ్‌రష్మిక దంపతులు గృహప్రవేశం చేశారు. అనంతరం వేద పండితుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య జరిగిన ఈ వేడుకలో విజయ్ దంపతులు సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. సినీ రంగంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, తన మూలాలను మర్చిపోకుండా విజయ్ తన సొంత ఊరికి రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గృహప్రవేశం అనంతరం విజయ్ గ్రామస్థులందరికీ భారీ విందు (దావత్) ఏర్పాటు చేశారు. ఊరందరినీ పిలిచి విందు ఏర్పాటు చేయడం విశేషం.

# సూర్య-వెంకీ అట్లూరి చిత్రానికి టైటిల్ ఖరారు.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో 'ప్రేమలు' చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని స్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్,



ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published at D.No. 42-4-61/A2,Bhavani Residency,FFB,2nd Lane , Ramarajuvari veedi, Ramakrishnapuram, Vijayawada - 520011, Andhra Pradesh,Printed at Sri Muktheswara Publications, D.No. 29-23-11, Thadepalli Vari Veedi, Surya Rao Peta, Vijayawada - 520002, Andhra Pradesh. Fax: 040-24054446, Cell:9440265569
Email: bharathasakti@gmail.com, RNI APTEL/2010/36743, Editor: Kesaram Penta Reddy